డీపీఎంఎస్ పొడిగింపు

హెచ్ఎండీఏ పరిధిలో మరో 2 నెలలు అందుబాటులో..

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ అనుమతుల్లో ఒకే విధానాన్ని అమలు చేసేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చర్యలు చేపట్టింది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు లోపల, బయట హెచ్ఎండీఏ పరిధిలోని 40 మున్సిపాలటీలు ఉండగా, గ్రామాలు 719 వరకు ఉన్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు లోపల సైతం హెచ్ఎండీఏ పరిధిలో కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం వస్తుండడంతో అక్రమ కట్టడాలు గణనీయంగా పెరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలకు జీ ప్లస్ 2 వరకే అనుమతి ఇచ్చే అవకాశం ఉండడంతో కొందరు 3,4,5 అంతస్తులతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన హెచ్ఎండీఏ పూర్తి స్థాయిలో టీఎస్ బీపాస్‌ను గ్రామాల్లో అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఇందుకు అనుగుణంగానే హెచ్ఎండీఏ పరిధిలో పూర్తి స్థాయిలో టీఎస్ బీ పాస్ ద్వారానే అనుమతులు ఇచ్చేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించే పనిని ఐటీ కన్సల్టెన్సీలకు అప్పగించారు. ఇదిలా ఉంటే... సోమవారం హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి అధ్యక్షతన ఇద్దరు ప్లానింగ్ డైరెక్టర్లు, 4 ప్లానింగ్ ఆఫీసర్స్‌తో పాటు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్ రూపొందించే ఐటీ నిపుణులతో ప్రత్యేకంగా చర్చించారు. 2 నుంచి 3 నెలల వ్యవధిలో డీపీఎంఎస్‌ను పూర్తి స్థాయిలో టీఎస్ బీపాస్ పరిధిలోకి తీసుకొచ్చేలా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను రూపొందిస్తామని ఐటీ నిపుణులు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామాల ప్రజల సౌకర్యం కోసం డీపీఎంఎస్‌ను 2-3నెలల పాటు కొనసాగించాలని, ఫిబ్రవరి 5న మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించారు.

వీఐటీ-ఏపీ యూనివర్సిటీకి ఐఎస్ఓ సర్టిఫికేషన్

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): ఏపీలోని అమరావతి కేంద్రంగా ఉన్న వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి మూడు అంతర్జాతీయ గుర్తింపునిచ్చే సర్టిఫికేషన్ వచ్చింది. ఇంటర్నేషనల్ అర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్: ఐఎస్ఓ 21001/2018 (ఎడ్యుకేషనల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్), ఐఎస్ఓ 5001/2018 (ఎనర్జీ మేనేజ్‌మెంట్), ఐఎస్ఓ14001/2015 (ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్)లలో గుర్తింపు వచ్చినట్లుగా వీసీ డా.ఎస్వీ కోటారెడ్డి వెల్లడించారు. ఉన్నత విద్యా ప్రమాణాలు, పర్యావరణహితమైన క్యాంపస్ పరిసరాలు, గ్రీన్ జోన్ అమలు, వాన నీటి సంరక్షణ, కాలుష్య నియంత్రణ వంటి కార్యక్రమాలతో తమకు గుర్తింపు వచ్చిందన్నారు. కాగా, నగరంలోని హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ శివయ్య వీసీ డా.ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్రకు అందజేశారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు హాజరుకండి..

ఫిబ్రవరి 1 నుంచి నాలుగురోజుల పాటు బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమి ఆధ్వర్యంలో జరుగనున్న కాసాని కౌసల్య ముదిరాజు మెమోరియల్ 49వ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ -2024 పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను ఆయన నివాసంలో సోమవారం కలిసి ఆహ్వానించారు. ఇందులో కాసాని వీరేశ్ ముదిరాజు, ఎంపీ రంజిత్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఉమ్మడి రంగారెడ్డి ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు పాల్గొన్నారు.

- దుండిగల్, జనవరి 29

భారత్ ఆర్ట్స్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో సంక్రాంతి సంబురాలు, సంక్రాంతి స్వర్ణ నంది అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ చైర్మన్ లయన్ కేవీ రమణారావు సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన సినీనటుడు బాబుమోహన్, దైవజ్ఞశర్మ జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురి కళాకారులు, నాట్యగురువులకు స్వర్ణ నంది అవార్డులను బహూకరించారు. ప్రముఖ సినీ హాస్య నటుడు బాబుమోహన్‌ను స్వర్ణ నంది అవార్డుతో లయన్ కేవీ రమణారావు, దైవజ్ఞ శర్మ సత్కరించారు. కార్యక్రమంలో లయన్ లలితారావు, కాల్వ సుజాత, ఆర్.కుమార్, వ్యవస్థాపక చైర్మన్ రమణారావు పాల్గొన్నారు.

- రవీంద్రభారతి, జనవరి 29

నైపుణ్యాభివృద్ధితో పుష్కళమైన ఉద్యోగ అవకాశాలు

స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఇస్కీతో కీలక ఒప్పందం

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే యువత పుష్కళమైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమంలో ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీ శ్రీనిధి, సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ సంస్థలు ఇస్కీ మధ్య స్కిల్ డెవలప్‌మెంట్‌లో సోమవారం కీలక ఒప్పందం చేసుకున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రోగ్రామర్ నైపుణ్యాలను పెంపొందించడంలో ఈ ఒప్పందం ముఖ్య భూమికను పోషిస్తుందని ఆయన తెలిపారు. గచ్చిబౌలిలోని ఇస్కీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు కలిసి ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. పలువురు మాట్లాడుతూ, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్యత కలిగిన మానవ వనరుల అభివృద్ధియే లక్ష్యంగా ఇస్కీ పనిచేస్తుందన్నారు. ఈ తరహా నైపుణ్య శిక్షణ ద్వారా ఐటీ రంగానికి స్కిల్డ్ మ్యాన్‌పవర్ సమకూరుతుందని అభిప్రాయపడ్డారు.

బంజారాహిల్స్ రోడ్ నం.12లో రోడ్డు విస్తరణ అంశాలను పరిశీలించేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

జీహెచ్ఎంసీ, పోలీసు ఉన్నతాధికారుల పరిశీలన

సిటీబ్యూరో/బంజారాహిల్స్, జనవరి 29: బంజారాహిల్స్ రోడ్ నం.1లోని పెన్షన్ ఆఫీస్ జంక్షన్‌తో పాటు సమీపంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను తగ్గించేందుకు గల అవకాశాలను జీహెచ్ఎంసీ, పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. దీంతో పాటు రోడ్ల విస్తరణ చేపట్టడానికి జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, నగర పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాసరెడ్డితో పాటు ఆయా విభాగాల అధికారులు సోమవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. మాసబ్ ట్యాంక్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నం.12 దాకా రోడ్డు విస్తరణకు గల అవకాశాలను పరిశీలించారు. మాసబ్ ట్యాంక్ వైపు నుంచే వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగడానికి గల కారణాలను గమనించిన అధికారులు బంజారా ఫంక్షన్ హాల్ పక్కన నాలా వైపు నుంచి లింక్ రోడ్డును విస్తరించడం ద్వారా ప్రయోజనం ఉంటుందా? అనే అంశాన్ని అధ్యయనం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో పాటు బల్కాపూర్ నాలా మీదుగా ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సూచించారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే బంజారాహిల్స్ రోడ్ నం.12లో రోడ్డు విస్తరణను చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో ట్రాఫిక్ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ రంగనాథ్, వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, సిటీ ప్లానింగ్ విభాగం అధికారి రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో పలు రైల్వే స్టేషన్ల మధ్య ప్రస్తుతం నడుస్తున్న 22 ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ సోమవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 31 తరకు టైం టేబుల్ వారీగా ఇవి కొనసాగిస్తాయన్నారు. సికింద్రాబాద్ - అగర్తాల, సికింద్రాబాద్, దిబ్రూఘర్, గోరక్‌పూర్ -హైదరాబాద్, హైదరాబాద్ - జైపూర్, తిరుపతి - సాయినగర్ సిరిడీ, హైదరాబాద్ - రాక్సెల్, సికింద్రాబాద్ - ధనపూర్, సికింద్రాబాద్ - రాక్సెల్ కాచిగూడ - మధురై, కాచిగూడ - నాగర్సోల్, నాందెడ్ - ఎరోడా స్టేషన్ల మధ్యలో ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. పూర్తి వివరాల కోసం ఎస్‌సీఆర్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యా మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి

ఉపాధి కల్పించే కోర్సులపై దృష్టి పెట్టండి

- బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో రెండు రోజుల సదస్సు
- ప్రారంభించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగులకు ఉపాధి కల్పిచడంలో యూనివర్సిటీలు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. ఓపెన్ యూనివర్సిటీ, సామాజిక శాస్త్ర విభాగం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్‌సీఆర్ సౌత్ రీజియన్ ఆధ్వర్యంలో సోమవారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 'భారత దేశంలో ఉన్నత విద్య - నాణ్యత సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలోని ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్యలో గణనీయ అభివృద్ధి ఉందని, ఇప్పటికే దేశంలో ఉన్న విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య 28.4 శాతంగా ఉందన్నారు. తెలంగాణలో ఇది 40 శాతం నమోదు కావడం శుభపరిణామమన్నారు. అలాగే, జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, వర్గాల నమోదు శాతం బాగా పెరిగిందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే మహిళల సంఖ్య కూడా బాగా పెరిగిందన్నారు. ఉన్నత విద్యాభివృద్ధిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పాత్ర చాలా కీలకమన్నారు. అయితే డిగ్రీతో పోల్చితే పీజీలో ప్రవేశాలు పొందుతున్న వారి సంఖ్య 15 శాతం దాటడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, దూర విద్యలో విస్తృత ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రైవేటీకరణ, మార్కెటీకరణ, సమాజంలో అసమానతలు, పాలకుల్లో చిత్తశుద్ధి లేమి, పక్షపాత ధోరణి వంటివి విద్యా వ్యవస్థలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయన్నారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీతారామారావు, అడకమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్ఎన్‌రెడ్డితో పాటు యూనివర్సిటీకీ చెందిన పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన

సైదాబాద్, జనవరి 29: యువతకు దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన సమావేశాన్ని మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ మెస్‌లో నిర్వహించే అవగాహన సమావేశాన్ని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో పాల్గొనే యువత తమతో పాటు వ్యాలిడ్ పాస్‌పోర్ట్, సీవీ, ఎడ్యుకేషనల్, టెక్నికల్ సర్టిఫికెట్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. నిన్నమొన్నటి వరకు సాధారణ స్థాయి కంటే ఎక్కువ స్థాయిలో నమోదైన ఉష్ణోగ్రత్తలు సాధారణ స్థాయి కంటే తక్కువగా నమోదయ్యాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 1.9 తగ్గి 29.1 డిగ్రీల సెల్సీయస్, కనిష్ఠం సాధారణ స్థాయి కంటే 0.4 తగ్గి 17.6 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 45 శాతంగా నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

జెర్సీ ఆవిష్కరణ

గోవా వేదికగా జరిగే ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ జెర్సీని సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ వేణుమాధవరావు. టోర్నీలో రాష్ట్రం తరపున 246 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో బరిలోకి దిగుతున్నారు.

రెవెన్యూ ప్రమోషన్లను వెంటనే కల్పించాలి

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

కవాడిగూడ, జనవరి 29: కొంత కాలంగా రెవెన్యూ శాఖలో ప్రమోషన్లను వెంటనే కల్పించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రమోషన్లు లేక ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురువుతున్నారని అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఇందిరా పార్కులో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండమల్ల రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొండమల్ల రవి, గౌరవాధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ గౌస్ ఎన్నికయ్యారు. అనంతరం, రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో మరుపట్ల మల్లయ్య, కృష్ణస్వామి, ఎద్దు రామకృష్ణ, జూనియర్ నాయకులు రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

అపోలో సేవలకు గుర్తింపు

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం-జేఏవై) వంటి పథకాల కింద అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చేస్తున్న ఆదర్శప్రాయమైన సేవలకు గుర్తింపు లభించింది. అపోలో సేవలను గుర్తిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అపోలో ఆనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సీఈవో అపర్ణారెడ్డికి ప్రశంశా పత్రాన్ని అందజేశారు. అపోలో రెండు దశాబ్దాలుగా తెలంగాణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద అనేక మంది రోగులకు చికిత్స అందించింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జాయింట్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ వెంకట్ దీప్ చోడిపల్లి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ మహబూబ్ పాషా, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, ఏఐఎంఎస్ఆర్ సీనియర్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాజేశ్, అడ్మిషన్ ఆఫీసర్ సునీల్ పాల్గొన్నారు.

ఐఐసీటీని సందర్శించిన లడక్ విద్యార్థులు

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని లడక్ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ, జియోలజీ విద్యార్థులు సందర్శించారు. ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా నగరంలోని ఐఐసీటీని విజిట్ చేసి పరిశోధనలు, రీసెర్చ్ ఫెసిలిటీలను తెలుసుకున్నారు. కాగా, లడక్ విద్యార్థులకు చీఫ్ సైంటిస్ట్ కె.రాజేందర్‌రెడ్డి సారథ్యంలో ముఖ్య పరిశోధనల్లో ఐఐసీటీ విధులు, కెమికల్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునాతన సాంకేతికతను వివరించారు. కాగా, ఎడ్యుకేషన్ విజిట్‌లో భాగంగా ఐఐసీటీని సందర్శించే విద్యార్థులు సైంటిస్టులను కలుసుకునే వీలు కల్పిస్తారు.

అగ్రి వర్సిటీ విద్యార్థులకు రాజకీయ మద్దతు

కాప్రా, జనవరి 29: రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు జీఓ నం.55కు వ్యతిరేకంగా చేపడ్తున్న శాంతియుత ధర్నాకు మద్దతుగా 'విద్యార్థుల రాజకీయ పార్టీ' నిలిచింది. 21వ రోజు ధర్నాలో అగ్రికల్చర్ విద్యార్థులకు మద్దతుగా 'విద్యార్థుల రాజకీయ పార్టీ' గ్రేటర్ అధ్యక్షులు నర్రా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వివిధ కళాశాలల విద్యార్థులు ధర్నాలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.55ను వెనక్కు తీసుకునేవరకు వ్యవసాయ విద్యార్థులకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 'విద్యార్థుల రాజకీయ పార్టీ' అధ్యక్షులు సునీల్, మహిళా విభాగం అధ్యక్షురాలు సాత్విక రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్, అనికేత్, అనిల్, గోపాల్, మనోజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న 'విద్యార్థుల రాజకీయ పార్టీ' ప్రతినిధులు

కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన కోల్‌కతా రాజారామ్ మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ డైరెక్టర్ జనరల్ బీవీ శర్మ

కేంద్ర గ్రంథాలయానికి కోల్‌కత్తా ప్రముఖుల సందర్శన

సుల్తాన్‌బజార్, జనవరి 29: అప్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయాన్ని కోల్‌కతా రాజారామ్ మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ డైరెక్టర్ జనరల్ బీవీ శర్మ సోమవారం సందర్శించారు. గ్రంథాలయానికి విచ్చేసిన శర్మకు రాష్ట్ర కేంద్ర గ్రంథాలయ ముఖ్య గ్రంథ పాలకులు ఏవీఎన్ రాజు స్వాగతం పలికారు. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ స్కీమ్ కింద రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి మంజూరు చేసిన రూ.కోటి 12 లక్షల నగదుతో కొనుగోలు చేసిన ఫర్నీచర్ సామగ్రిని, కంప్యూటర్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, జిరాక్స్ మిషన్, ఎయిర్ కండీషనర్లు తదితర పరికరాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్కీం కింద మంజూరైన నగదుతో గ్రంథాలయ అభివృద్ధికి గాను పరికరాలను సమకూర్చుకోవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

రేపు జాబ్ మేళా

సిటీబ్యూరో/ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29: ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో (మోడల్ కెరియర్ సెంటర్)లో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. సియారా గ్రూప్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, టెలీకాలర్స్ ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళాకు హాజరయ్యేందుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9885030364 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో 31న మల్లేపల్లిలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి మైత్రిప్రియ తెలిపారు. గౌతమి మోడల్ స్కూల్, కల్కి హెచ్ఆర్ సొల్యూషన్ వంటి రెండు ప్రైవేటు సంస్థల్లో వంద వరకు ఖాళీలు ఉన్నాయని, అవకాశాన్ని యువత పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో..

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 29: మేడ్చల్ కలెక్టరేట్‌లో ఈ నెల 31న జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన, ఆసక్తి గల నిరుద్యోగ యువత WWW.NIC.GOV.INలో రిజిస్టర్ చేసుకొని హాజరుకావాలని, ఇతర వివరాలకు ఫోన్ నం: 73868 09422ను సంప్రదించాలన్నారు.

బీఎఫ్ఏ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్ / పెయింటింగ్ అండ్ ఫొటోగ్రఫీ) కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండు, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.in లో చూసుకోవచ్చన్నారు.

దూర విద్య ఎంఏ పొలిటికల్ సైన్స్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంఏ పొలిటికల్ సైన్స్ (నాన్ ఇంటర్నల్, ఇంటర్నల్) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

గురుకుల కళాశాలలో దరఖాస్తులు

బండ్లగూడ, జనవరి 29: తెలంగాణ గిరిజన గురుకుల ప్రతిభ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న గిరిజన బాల, బాలికలు www.tgtwgurukulam.Telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా రూ.200ల రుసుము చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాంతీయ అధికారి కళ్యాణి పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 18వ తేదీన లెవెల్ వన్ స్క్రీన్ టెస్ట్, మార్చి 10వ తేదీన లెవెల్ టూ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టెస్టుల తర్వాత అడ్మిషన్ పొందిన వారికి అకాడమిక్ బోధనతో పాటు ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించిన